సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 15 । మార్చి । 2025



నిత్యాన్నదాన పథకానికి..

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి జంపాల వెంకట రమణ (మిర్యాలగూడ) శుక్రవారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



రూ.1,11,116 విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు ఏబీసీ సభ్యుడు కామన ప్రభాకరరావు (మండపేట) శుక్ర వారం రూ.1,11,116 విరాళం అందజేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం (సాయంత్రం)	సహర్ ఆదివారం (ఉదయం)
రాజమండ్రి	6.20	4.50
కాకినాడ	6.20	4.50
అమలాపురం	6.20	4.50

న్యూస్‌రీల్

భీమేశ్వరుని సన్నిధిలో తెలంగాణ హైకోర్టు జడ్జి



భీమేశ్వరస్వామిని దర్శించుకుంటున్న జస్టిస్ శరవన్‌కుమార్ దంపతులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామిని తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ ఎన్‌వీ శరవన్‌కుమార్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. జడ్జి దంపతులకు పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారిని, అమ్మవారిని వారు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బేడా మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ సిబ్బంది స్వామివారి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికలను అందజేశారు. రామచంద్రపురం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నాగేశ్వరరావు నాయక్, ఆర్డీఓ దేవరకొండ అఖిల తదితరులున్నారు.

నేటితో వెబ్ ఆప్షన్ ముగింపు

అమలాపురం రూరల్: జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగే డీఎస్సీ ఉచిత కోచింగ్ కోసం జ్ఞానభూమి వెబ్ పోర్టల్‌లో వెబ్ ఆప్షన్ల సర్వీసు ప్రారంభించినట్టు ఆ శాఖ మహిళా సాధికారత అధికారి ఎం.జ్యోతి లక్ష్మీదేవి శుక్రవారం ఇక్కడ తెలిపారు. వెబ్ ఆప్షన్లను శనివారంలోగా అభ్యర్థులు నమోదు చేసుకోవాలని కోరారు. షార్ట్ లిస్టులో ఉన్న వెయ్యి మంది అభ్యర్థులు ఇప్పటికే తమ వెబ్ ఆప్షన్లను పూర్తి చేశారని చెప్పారు. షార్ట్ లిస్ట్ చేసిన మిగిలిన అభ్యర్థులు తమ వెబ్ ఆప్షన్లను సమయానికి పూర్తి చేయాలని సూచించారు. గతంలో జ్ఞానభూమి పోర్టల్ కోచింగ్ కోసం నమోదు చేసుకున్న అభ్యర్థులూ వెబ్ ఆప్షన్లు పూర్తి చేసుకోవాలని కోరారు.

అమ్మవారి పంచలోహ విగ్రహం సమర్పణ



నూకాంబిక అమ్మవారి పంచలోహ విగ్రహం

ఆలమూరు: చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారికి ఓ భక్తుడు పంచలోహ ఉత్సవ విగ్రహం సమర్పించారు. మండపేటకు చెందిన రామకృష్ణ బ్రాస్ అండ్ సిల్వర్ వర్క్స్ అధినేత, ప్రముఖ శిల్పి వాసా శ్రీనివాస్, లక్ష్మీపార్వతి దంపతులు సుమారు రూ.1.25 లక్షలతో 35 కిలోల బరువు కలిగిన పంచలోహాలతో ఈ విగ్రహాన్ని తయారు చేయించారు. దాతలైన శ్రీనివాసు దంపతులు శుక్రవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేతుల మీదుగా ఈ విగ్రహాన్ని అమ్మవారి ఆలయానికి సమర్పించారు. అమ్మవారి విగ్రహ రూపకల్పన కోసం 30 రోజులు పట్టింది. అయోధ్య రామాలయంలో 25 కేజీల బాలరాముడి పంచలోహ మూర్తిని గతేడాది కార్తిక మాసంలో సమర్పించినట్టు దాత శ్రీనివాస్ తెలిపారు.

కాటేస్తోంది

- ఎటుచూసినా తూకాల్లో తేడా, కొలతల్లో కోత
- వస్తు విక్రయాల్లో ఎడాపెడా మోసం
- ప్రశ్నిస్తున్న విజ్ఞులైన వినియోగదారులు
- ఫోరాలు, కోర్టులను ఆశ్రయిస్తున్న వైనం
- నేడు ప్రపంచ వినియోగదారుల దినోత్సవం

అమలాపురం టౌన్/అంబాజీపేట: ప్యాక్డ్ వస్తువుల విక్రయాల్లోనూ, పండ్లు, కూరగాయల దుకాణాల్లోను తూకాలు, కొలతల్లో తేడాతో వినియోగదారులు నిత్యం ఏదో రకంగా మోసపోతున్నారు. చైతన్యంతో ప్రశ్నిస్తే, కొంత న్యాయం జరిగి.. నాణ్యమైన సరకులు పొందగలుగుతున్నారు. మనకెందుకులే అని ఊరుకున్న వారు మాత్రం తూకాలు, కొలతల మాయలో చిక్కుకుంటున్నారు. జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంలో 'సాక్షి' బృందం పలు దుకాణాలు, తోపుడు బండ్లపై చేస్తున్న తూకాల్లో తేడాలను గుర్తించింది. శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు 'సాక్షి' బృందం పట్టణంలో పలు దుకాణాలు, పండ్లు, కూరగాయల దుకాణాలను పరిశీలించినప్పుడు కొన్నిచోట్ల మోసాలు వెలుగుచూశాయి.

కౌంటర్ స్కేల్ కాటాల మాటునే మోసం

అమలాపురం పట్టణంలో దాదాపు 300కి పైగా తోపుడు బండ్లపై ఉన్న పండ్లు, కూరగాయలు, ఇతర వస్తువుల తాత్కాలిక దుకాణాల్లో కౌంటర్ స్కేల్ కాటాలే ఉన్నాయి. కొన్ని తోపుడు బండ్లు, కూరగాయల దుకాణాల్లో ఈ కౌంటర్ స్కేల్ కాటాల మాయాజాలం కనిపించింది. ఆ మేరకు వినియోగదారులు సరకును కోల్పోతున్నారు. కిలో సరకులకు 50 నుంచి 100 గ్రాముల బరువును కోల్పోతున్నట్టు 'సాక్షి' బృందం పరిశీలనతో తేలింది. పట్టణంలో ఇంకా నేటికీ కొన్ని సరకుల అమ్మకాల్లో కుంచాలు, శేర్లు, గిద్దలు వంటి పాత తరం కొలతలను అవలంబిస్తున్నారు. నూనెలు, సీజనల్ పండ్లు అంటే, రేగు, ఈత పండ్లు వంటి వాటి కొలతలు ఇలాగే ఉంటున్నాయి. ఇందులో కూడా కచ్చితంగా కోత ఉంటుందన్న వాస్తవాన్ని వినియోగదారులు గమనించాలి. కొంత మంది వినియోగదారులకు ఈ మోసాల గురించి తెలిసినా, చిరు వ్యాపారే కదా అనే సానుభూతితో ఇలాంటి మోసాలు వెలుగు చూడడం లేదు. పట్టణంలో కౌంటర్ స్కేల్ తూకాలు, కొలతల్లో తేడాలతో వినియోగదారులు రోజుకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకూ కోల్పోతున్నట్టు ఓ అంచనా. ఇలాంటి మోసాలపై ఫోరాలు, కోర్టులను ఆశ్రయించేందుకు ఇట్టే ఆధారాలు ఉండవు. అలాంటి వ్యాపారులను వినియోగదారులు చైతన్యంతో నిలదీయాల్సిన అవసరం ఉంది.

ఎమ్మార్పీ, ఎక్స్‌పైరీ డేట్లే కీలకం

మార్కెట్‌లో షాపులు, షోరూముల్లో అమ్మకానికి ఉంచే ప్యాకింగ్ చేసిన వస్తువులపై వినియోగదారులు ఎమ్మార్పీని, ఎక్స్‌పైరీ డేట్‌ను కచ్చితంగా పరిశీలించాలి. షాపు సిబ్బంది ఎమ్మార్పీ కంటే ఒక్క పైసా ఎక్కువకు అమ్మినా, ఎక్స్‌పైరీ డేట్ మీరిన సరకును అంటగట్టినా, తగిన ఆధారాలతో వినియోగదారుల ఫోరానికి వెళ్లవచ్చు. అలాగే సమీపంలో ఉన్న తూనికలు, కొలతల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. వినియోగదారుడికి నిశిత పరిశీలన లేనప్పుడు షాపు యాజమాని అదే బలహీనతగా తీసుకుని అధిక ధరకు లేదా గడువు మీరిన వస్తువును అంటగట్టేందుకు యత్నిస్తారు. ఇలాంటప్పుడే వినియోగదారులు విజ్ఞతతో వ్యవహరిస్తే, మోసాలకు ఆదిలోనే అడ్డుకట్ట వేయవచ్చు. ప్యాకింగ్ వస్తువులపై ఎమ్మార్పీ, ఎక్స్‌పైరీ తేదీలు లేకపోతే సంబంధిత కంపెనీ లేదా తయారీదారుపై తగిన ఆధారాలతో కేసు వేయవచ్చు.

ప్రకటనలతో బురిడీ

కొన్ని వస్తువుల్లో వాస్తవానికి అంత నాణ్యత, మన్నిక లేకపోయినప్పటికీ, టీవీలు, న్యూస్ పేపర్లు తదితర మాధ్యమాల్లో ప్రకటనలు ఊదరగొడతాయి. ప్రకటనలకు తగ్గట్టుగా వస్తువులు లేనప్పుడు కూడా ఫోరాన్ని ఆశ్రయించవచ్చు. గతంలో గంగా స్నానం సబ్బు గంగా జలంతో తయారైందన్న ప్రకటనపై అప్పట్లో ఓ వినియోగదారుడు జాతీయ వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. వాస్తవానికి ఆ సబ్బు ఫ్యాక్టరీ.. గంగా నది ఉన్న రాష్ట్రంలోనే లేదు. ఈ కేసును విచారించిన కమిషన్ ఆ కంపెనీకి భారీ జరిమానా విధించింది.





కూరగాయల దుకాణంలో స్టీలు గిన్నె, తూకం రాయితో ఉన్న కౌంటర్ స్కేల్ కాటా

కన్స్యూమర్ హెల్ప్‌లైన్

వినియోగదారుల రక్షణ కోసం వినియోగదారుల రక్షణ చట్టం–1986 ఆవిర్భవించింది. నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్ నంబరు 1915కి ఫిర్యాదు చేయవచ్చు. సివిల్ సప్లయిస్ డిపార్ట్‌మెంట్ లేదా వెయిట్ అండ్ మెజర్‌మెంట్స్ అధికారులకు రాతపూర్వక ఫిర్యాదు చేయవచ్చు. మోసం తీవ్రతను బట్టి జాతీయ వినియోదారుల కమిషన్‌కు లేదా వినియోగదారుల ఫోరంను ఆశ్రయించవచ్చు.

మోసాల్లో రూపాలెన్నో..

బంగారు, కిరాణా దుకాణాలు వంటి చోట్ల విక్రయాల్లో జరిగే మోసాలు వివిధ రూపాల్లో ఉంటాయి. ఎలక్ట్రానిక్ కాటాల పేరుతో కూడా కంటికి కానరాని అక్రమాలు జరుగుతున్నాయి. బంగారు దుకాణాల్లో మిల్లీగ్రాములు, కిరాణా, ఫ్యాన్సీ దుకాణాల్లో గ్రాముల్లో నష్టపోతున్నారు. ఎలక్ట్రానిక్ కాటాల్లో కొందరు ముందుగానే ఫిక్స్ చేశాక తూకాల తరుగుతో మోసాలకు పాల్పడుతున్నారు. అదే కౌంటర్ స్కేల్ కాటాల్లో సరకులు వేసేందుకు దాదాపు 50 నుంచి 100 గ్రాముల బరువున్న స్టీలు గిన్నె ఉంచుతారు. ఆ బరువుతో కలిపి సరకులు తూస్తారు. మోసంలో ఇది కూడా కనికట్టే. కాటాలకు ఉపయోగించే 50, 100, 200, 250 గ్రాములు, అర కేజీ, కేజీ, ఆపైన ఇనుప రాళ్లుంటాయి. వీటికి తూనికలు, కొలతల శాఖ అధికారులు ప్రతి రెండేళ్లకోసారి తనిఖీ చేసి, సీళ్లు వేస్తారు. తనిఖీలు అంతంతమాత్రంగా ఉండడమే కాకుండా, కొందరు వ్యాపారులు సీలు వేయని తూకం రాళ్లను వినియోగిస్తున్నారు.

వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించడం ఇలా..

కపిలేశ్వరపురం: వస్తు సేవ విలువ రూ.20 లక్షల లోపు ఉన్నప్పుడు జిల్లా ఫోరాన్ని, రూ.20 లక్షల నుంచి రూ.కోటి అయితే రాష్ట్ర ఫోరాన్ని, రూ.కోటి కంటే ఎక్కువ ఉంటే జాతీయ ఫోరాన్ని ఆశ్రయించాలి. తీర్పు ఇచ్చాక, వాటిని అమలుపర్చి, ఆస్తులను జప్తు చేసే అవకాశం ఉంది. జిల్లా కేంద్రంలో జిల్లా ఫోరం ఏర్పాటు చేశారు. ఫిర్యాదుదారు స్వతహాగా కానీ, న్యాయవాది ద్వారా కానీ ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చు. వినియోగదారుడు వస్తువును అమ్మిన వ్యక్తికి ముందుగా నోటీసు ఇచ్చి, ఆ తర్వాత వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించాలి.

మోసాలను ప్రశ్నించాలి

ప్రతి వినియోగదారుడికి తూకాల్లో తేడాలను ప్రశ్నించే హక్కు ఉంటుంది. వినియోగదారులు చైతన్యం, అవగాహనతో ప్రశ్నించి, తమ హక్కులను సద్వినియోగం చేసుకున్నప్పుడే ఈ మోసాలకు కళ్లెం పడతాయి. కాల పరిమితికి లోబడి వ్యాపారులు తూకం రాళ్లకు సీళ్లు వేయించాలి. పారదర్శకంగా తూకాలు వేసినప్పుడే వినియోగదారులకు నాణ్యమైన రీతిలో సరకులు అందుతాయి. వస్తువుల కొనుగోలులో తేడాలుంటే మాకు ఫిర్యాదు చేయవచ్చు.

– జీవీ ప్రసాద్, ఇన్‌స్పెక్టర్, తూనికలు, కొలతల శాఖ, అమలాపురం

ఫోరాలను ఆశ్రయించాలి

వస్తు సేవల్లో అన్యాయం జరిగినా, తూకాలు, కొలతల్లో తేడాలున్నా, ఎమ్మార్పీకి మించి, ఎక్స్‌పైరీ డేట్‌ను మీరి అమ్ముతున్నా, వినియోగదారులు తగిన ఆధారాలతో వినియోగదారుల ఫోరాలను ఆశ్రయించాలి. వినియోగదారుల సంఘ అధ్యక్షునిగా ఫోరం, సివిల్ కోర్టుల్లో అనేక కేసులు వేసి, కొన్నింట్లో ఫలితాలు సాధించాను. టీవీలు, ఫ్రిజ్‌లు, బంగారం, కిరాణా సరకులు (ప్యాకింగ్), ఇలా గృహోపయోగ వస్తువుల విక్రయాల్లో అన్యాయం జరిగినా వినియోగదారులు చైతన్యంతో నిలదీయాలి. ఆయా కంపెనీలను కోర్టుకు ఈడ్చి న్యాయం పొందాలి.

– జీవీఎల్ఎన్ శర్మ, అధ్యక్షుడు, పట్టణ వినియోగదారుల సంఘం, అమలాపురం

ఘనంగా ప్రత్యంగిర హోమం

అన్నవరం: ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి శుక్రవారం ప్రత్యంగిర హోమం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో ఉదయం 9 గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, హోమం ప్రారంభించి, 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి వేదాశీస్సులు, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, ప్రసాదాలు నివేదించి, భక్తులకు పంపిణీ చేశారు. వేద పండితులు యనమండ్ర శర్మ, వనదుర్గ ఆలయ అర్చకుడు కోట వంశీ, పరిచారకుడు వేణు, వ్రత పురోహితులు చెళ్లపిళ్ల ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. హోమంలో వంద మందికి పైగా భక్తులు రూ.750 టికెట్టుతో పాల్గొన్నారు. వారు కుటుంబ సభ్యులతో తరలి రావడంతో హోమ మండపం సరిపోక, కొంతమంది వెలుపల వేచి ఉండాల్సి వచ్చింది. వనదుర్గ ఆలయం ఎదురుగా హోమం నిర్వహించినపుడు కూడా గతంలో ఇదే సమస్య ఎదురవడంతో హోమాన్ని మండపం దిగువకు మార్చారు. అయినప్పటికీ సమస్య అలాగే ఉంది. దీంతో ఆలయానికి ఎదురుగా ఎక్కువ మంది భక్తులు పాల్గొనేందుకు వీలుగా హోమ మండపం నిర్మిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ఘనంగా కుంకుమ పూజలు జరిగాయి.

జలకాలెలా స్వామీ!

- పంపాకు నీరొచ్చే దారేదీ?
- శ్రీరాముని, సత్యదేవుని చక్రస్నానాలకు తప్పని ఇబ్బంది
- గత నెలలోనే వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'
- ఆలస్యంగా స్పందించిన దేవస్థానం అధికారులు
- ఏలేరు నుంచి పంపాకు నీరివ్వాలని ఈఓ లేఖ
- సంబంధిత అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

అన్నవరం: చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లునే చందంగా మారింది అన్నవరం దేవస్థానం అధికారుల వ్యవహారం. పోలవరం కాలువ పనులు, పంపా గేట్ల మరమ్మతుల పేరిట జనవరి నుంచి పంపా నీటిని సముద్రంలోకి వదిలేస్తుంటే చోద్యం చూశారు. వచ్చే నెలలో శ్రీరామ నవమి, మే నెలలో సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవాలు జరగనున్నాయి. దీంతో మేల్కొన్న అధికారులు.. ఈ ఉత్సవాల సందర్భంగా నిర్వహించే స్వామివార్ల చక్రస్నానాలకు ఏలేరు నుంచి పంపాకు నీరు ఇప్పించాలని జిల్లా కలెక్టర్‌కు నాలుగు రోజుల కిందట లేఖ రాశారు. చక్రస్నాన మహోత్సవాలకు ఏలేరు నుంచి రోజుకు 200 క్యూసెక్కుల నీటిని పంపాకు విడుదల చేయించాలని కోరారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ షణ్మోహన్ దేవస్థానం, ఇరిగేషన్, పోలవరం అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, వివరాలు తెలుసుకున్నారు. అయితే, ఏలేరు నుంచి నీరు విడుదల చేస్తే పోలవరం కాలువ అక్విడెక్ట్ పనులకు ఆటంకం కలుగుతుందని పోలవరం అధికారులు చెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పంపా జలాశయాన్ని, పోలవరం కాలువ అక్విడెక్ట్ పనులను పరిశీలించడానికి ఈ నెల 18న వస్తానని, అప్పుడు దీనిపై పరిశీలించి, నిర్ణయం తీసుకుంటానని చెప్పారని అంటున్నారు.

ముందే చెప్పిన 'సాక్షి'

వాస్తవానికి ఈ సమస్యను 'సాక్షి' ముందే వెలుగులోకి తెచ్చింది. పంపా గేట్ల మరమ్మతులు, పోలవరం అక్విడెక్ట్ పనుల కారణంగా నీటిని దిగువకు వదిలేస్తుండడంతో పంపా రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయని గత నెల పదో తేదీన 'అడుగంటిన ది' శీర్షికన కథనం ప్రచురించింది. దీనివలన శ్రీరామ నవమి, సత్యదేవుని కల్యాణోత్సవాల సందర్భంగా దేవస్థానానికి నీటి సమస్య ఉత్పన్నమవుతుందని పేర్కొంది. అలాగే, ఫిబ్రవరి నుంచి మే నెల వరకూ వివాహాల సీజన్, ఉత్సవాల కారణంగా ఎక్కువ మంది భక్తులు రత్నగిరికి వస్తారని, అందువలన దేవస్థానానికి నీటి అవసరం ఎక్కువవుతుందని తెలిపింది. అప్పట్లోనే దేవస్థానం అధికారులు స్పందించి, ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి ఉంటే.. పంపా నుంచి నీరు పోకుండా బండ్ వేయించి, ఉన్న నీటిని నిలుపుదల చేయిస్తే సరిపోయేది. అలాగే, పోలవరం కాలువ పనులకు అడ్డు లేకుండా దానికి ఇరువైపులా గట్టు వేయిస్తే బాగుండేది. తద్వారా పంపాలో నీరు నిల్వ ఉండేది. కనీసం గత నెల 24న దేవస్థానానికి కలెక్టర్ వచ్చినప్పుడైనా ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్తే బాగుండేది. కానీ, ఈ సమస్యపై సుమారు నెల రోజులు ఆలస్యంగా దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు కలెక్టర్‌కు లేఖ రాశారు.

డెడ్ స్టోరేజీకి చేరువలో..

పంపాలో ప్రస్తుతం నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకి దగ్గరగా ఉన్నాయి. పంపా జలాశయంలో గరిష్ఠ మట్టం 103 అడుగుల వద్ద 0.43 టీఎంసీల నీటిని నిల్వ చేయవచ్చు. ప్రస్తుతం నీటిమట్టం 82 అడుగులుంది. 0.014 టీఎంసీల నిల్వలున్నాయి. ఇది 0.007 టీఎంసీలకు తగ్గితే పంపా డెడ్ స్టోరేజీకి చేరుతుంది.

ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరువగా ఉన్న పంపా నీటిమట్టం





గత నెల 10న 'సాక్షి' ప్రచురించిన కథనం

వరి చేలలో మోటార్ సైకిల్‌తో

రైతుల నిరసన

సాగు నీరందక బీడు వారుతున్నాయని ఆందోళన



కూనవరంలో వరి చేలలో మోటార్ సైకిల్‌తో నిరసన తెలుపుతున్న రైతులు

ఉప్పలగుప్తం: కూనవరం పంచాయతీ గరువుపేటలో సాగు నీరందక చేలు బీడుగా మారుతున్నాయని రైతులు వరి చేలలో మోటార్ సైకిల్ నడుపుతూ శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల గోడును పట్టించుకునే నాథుడే లేడని వాపోయారు. ఈ ప్రాంతంలో సాగు నీరందక సుమారు 350 ఎకరాలు బీడుగా మారిందని, వెన్ను ఈనిక దశలో పంట ఉండగా, సాగు నీరందించకపోతే నిరుపయోగంగా మారి నష్టపోతున్నామన్నారు. ఈ విషయమై చాలా సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, వారి నుంచి స్పందన లేదని ఆవేదన చెందారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నీటి సంఘాలు లేనప్పటికీ సాగు నీరు అందేదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో నీటి సంఘాలను ఏర్పాటు చేసినా ప్రయోజనం లేదని నిస్సహాయత వ్యక్తం చేశారు. కూనవరం మేజర్ డ్రెయిన్‌పై క్రాస్ బండ్‌ను ఏర్పాటు చేయడంతో, ఉప్పు నీరు పోటెక్కి పంట కాలువల్లోకి చేరి, కనీసం చేనుకు సాగు నీరు పెట్టుకునే అవకాశం సైతం లేదని వివరించారు. తొలకరి సాగు నష్టపోయామని, అప్పు చేసి దాళ్వా సాగు చేస్తున్నామని, ఉన్నతాధికారులు స్పందించి సాగు నీరందించకపోతే భారీ నష్టాలు తప్పవని రైతులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతులు చింతా నాగరాజు, వాకపల్లి దొరబాబు, పరమట నాగరాజు, పోద్దోకు బాబులు, బళ్ల నరసింహమూర్తి, వాకపల్లి చిట్టిబాబు, కోలా పల్లపురాజు, బళ్ల సత్యనారాయణ, పరమట సింహాద్రి పాల్గొన్నారు.

తుది అంకానికి పది

- ఈ నెల 17 నుంచి పరీక్షల నిర్వహణ
- ఇన్విజిలేటర్ల నియామకం పూర్తి
- పరీక్షా కేంద్రంలో ఇద్దరికి తక్కువ కాకుండా మహిళా ఇన్విజిలేటర్లు



పదో తరగతి విద్యార్థులు

రాయవరం: జిల్లావ్యాప్తంగా పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు తుది అంకానికి చేరాయి. మొత్తం 22 మండలాల్లో 110 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఈ నెల 17 నుంచి 31 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ నెల 31వ తేదీ రంజాన్ సెలవు ప్రకటిస్తే, ఆ రోజు జరగాల్సిన పరీక్షను ఏప్రిల్ ఒకటిన నిర్వహిస్తారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్ష జరగనుంది. అరగంట ముందుగా పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారు.

ఇన్విజిలేటర్ల ఖరారు

పరీక్షల నిర్వహణలో ముఖ్యమైన ఇన్విజిలేటర్ల నియామకం కూడా పూర్తి చేశారు. ఇన్విజిలేటర్ల జాబితాలను ఒకటికి రెండు సార్లు పరిశీలించి, విద్యా శాఖ అధికారులు వాటిని ఖరారు చేశారు. ఈసారి పది పరీక్షల్లో స్కూల్ అసిస్టెంట్ల నియామకానికి ప్రాధాన్యమిచ్చారు. స్కూల్ అసిస్టెంట్లు సరిపోని పక్షంలో ఎస్‌జీటీల నియామకం చేపట్టారు. సబ్జెక్టు ఉపాధ్యాయులను వారి సబ్జెక్టు పరీక్షల రోజు రిలీవ్ చేస్తారు. మరోవైపు ఇన్విజిలేటర్లుగా నియమితులైన వారి మొబైల్ ఫోన్లకు విద్యా శాఖ నుంచి మెసేజ్‌లు పంపుతున్నారు. ఇన్విజిలేటర్లుగా నియమితులైన ఎస్‌జీటీలను ఎంఈఓలు, స్కూల్ అసిస్టెంట్లను హెచ్‌ఎంలు రిలీవ్ చేయనున్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో కనీసం ఓ మహిళా ఇన్విజిలేటర్ ఉండేలా చర్యలు తీసుకున్నారు.

జిల్లా పరిధిలో..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో 110 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో 19,217 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రతి పరీక్షా కేంద్రానికి సీఎస్, డీవోను నియమించారు. 240 మంది విద్యార్థులకు మించి ఉన్న పరీక్షా కేంద్రంలో అదనంగా ఓ డీవోను నియమించారు. జిల్లాలో 11 పరీక్షా కేంద్రాలకు అదనపు డీవోలు నియమితులయ్యారు. అలాగే 800 మంది ఇన్విజిలేటర్ల నియామకం పూర్తయింది. జిల్లావ్యాప్తంగా పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసేందుకు ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించారు.

పోలీస్ స్టేషన్లకు ప్రశ్నా పత్రాలు

పది పరీక్షల ప్రశ్నా పత్రాలు ఆయా మండలాల్లోని పోలీస్ స్టేషన్లకు చేరాయి. ఈ నెల 11, 12 తేదీల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నా పత్రాలు జిల్లా కేంద్రమైన అమలాపురం చేరుకున్నాయి. 11న సెట్–1, 12న సెట్–2 ప్రశ్నా పత్రాలు చేరుకోగా, 12న సెట్–1, 13న సెట్–2 ప్రశ్నా పత్రాలు అమలాపురం బాలుర ఉన్నత పాఠశాల నుంచి మండల స్టోరేజ్ పాయింట్లుగా ఉన్న పోలీస్ స్టేషన్లకు చేరాయి. ఆయా పరీక్షా కేంద్రాల సీఎస్, డీవోలు వాటిని సబ్జెక్టు, తేదీల వారీగా విభజించుకుని వాటిని పోలీస్ స్టేషన్లలో భద్రపర్చారు.

మూడు సమస్యాత్మక కేంద్రాలు

జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. రాయవరం మండలం పసలపూడి జెడ్పీ హైస్కూల్, మామిడికుదురు మండలం మొగలికుదురు జెడ్పీ హైస్కూల్, కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి, వీటిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 51'సి' పరీక్షా కేంద్రాలకు 35 మంది 'సి' సెంటర్ కస్టోడియన్లను నియమించారు.

ప్రథమ చికిత్సకు ఏర్పాట్లు

పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అనారోగ్య సమస్యలు ఎదురైతే వెంటనే సత్వర వైద్యం అందించేలా ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన వైద్య సిబ్బందిని వైద్యారోగ్య శాఖ నియమించింది. పరీక్షా కేంద్రాల సమీపంలోని పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న ఏఎన్ఎం, ఆశా వర్కర్‌ను నియమించి, ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. వైద్య సిబ్బందికి కూడా సెల్‌ఫోన్ అనుమతి లేదు. పరీక్షా కేంద్రాల వద్ద 200 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తునూ ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షా కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్‌గా ప్రకటించారు.

ఎవరికీ మినహాయింపు లేదు



పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్షల విధులకు నియమించిన వారిలో ఏ ఒక్కరికీ మినహాయింపు ఇచ్చే ప్రసక్తి లేదు. ఏదైనా బలమైన కారణాలు ఉంటే తప్ప మినహాయింపు ఇవ్వం. పరీక్షల నిర్వహణలో ఎక్కడా, ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా ఇన్విజిలేటర్లు పరీక్షల విధులు నిర్వర్తించాలి. పరీక్షా కేంద్రంలో ఇన్విజిలేటర్లు హద్దు మీరి ప్రవర్తించరాదు. ఇన్విజిలేటర్లతో సహా, సీఎస్, డీవోలకు కూడా సెల్‌ఫోన్ అనుమతి లేదు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రాల్లోకి పంపాలి. ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదు.

– డాక్టర్ షేక్ సలీం బాషా, డీఈవో, అమలాపురం

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	15,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,000
గటగట (వెయ్యి)	14,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

నేటి నుంచి ఒంటిపూట బడులు

రాయవరం/కొత్తపేట: జిల్లా అంతటా నేటి నుంచి పాఠశాలల్లో ఒంటిపూట బడులు నిర్వహించనున్నారు. విద్యా శాఖ క్యాలండర్ ప్రకారం మార్చి 15 నుంచి ఒంటి పూట బడులు నిర్వహించాల్సి ఉంది. అందులో భాగంగా శనివారం నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలంటూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వి.విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కారణంగా మండుతున్న ఎండల నుంచి విద్యార్థులకు ఉపశమనం లభించనుంది. విద్యా శాఖ క్యాలండర్ ప్రకారం ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, ఇతర ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలతో పాటు, ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలకు ఒంటిపూట బడుల నిబంధన వర్తిస్తుంది. పదో తరగతి పరీక్షలు ఈ నెల 17 నుంచి నిర్వహించనున్న నేపథ్యంలో ఒకటో తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఒంటి పూట బడులు వర్తిస్తాయి. పది పరీక్షా కేంద్రాలున్న పాఠశాలల్లో మాత్రం ఒకటి నుంచి 9వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం పాఠశాల నిర్వహిస్తారు. ఒంటిపూట బడులు నిర్వహించాలంటూ జిల్లా విద్యా శాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఒంటి పూట బడులను ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించాల్సి ఉంటుంది. ఉదయం 7.45 నుంచి ఎనిమిది గంటలకు అసెంబ్లీ నిర్వహించాలి. పాఠశాల ముగిసిన అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేసిన తర్వాత వారిని ఇళ్లకు పంపించాల్సి ఉంది.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి


రేకాడ ధనకుమారి(ఫైల్)

ముమ్మిడివరం: క్రివాడి నిరేవు పంచాయతీ శివారు చింతావానిరేవుకు చెందిన ఓ వివాహిత విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గ్రామానికి చెందిన రేకాడి ధనకుమారి(23) శుక్రవారం ఉదయం నీళ్ల కాయడానికి వాటర్ హీటర్ పెడుతుండగా విద్యుదాఘాతానికి గురైంది. ఎవరూ గమనించకపోవడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు భర్త కనకరాజు, మూడేళ్ల పాప ఉన్నారు.

నువ్వులు.. రైతన్న మోములో నవ్వులు

- పెరిగిన నువ్వుల సాగు
- ఆశాజనకంగా పంట
- ఎకరాకు ఆరు క్వింటాళ్ల వరకు దిగుబడి!


గొల్లప్రోలు మండలం దుర్గాడలో నువ్వుల చేను

పాడి-పంట

పిఠాపురం: గతంలో ఖాళీగా ఉన్న భూముల్లో ప్రత్యామ్నాయంగా సాగు చేసే నువ్వుల పంటను ఇప్పుడు ప్రధానంగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం నువ్వుల పంట ఆశాజనకంగా ఉందని రైతులు చెబుతున్నారు. గతంలో కేవలం ఎకరాకు రెండు బస్తాలు కూడా రాని దిగుబడి.. ఇప్పుడు ఎకరాకు 8 నుంచి 12 బస్తాలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొక్కజొన్న, మిరప, వంగ, టమాటా వంటి పంటలను తగ్గించి, ఎక్కువ మంది రైతులు నువ్వుల సాగు చేపట్టారు. దీంతో కాకినాడ జిల్లాలో నువ్వుల సాగు గణనీయంగా పెరిగింది. గతంలో కేవలం 100 ఎకరాల్లో మాత్రమే ఉండే ఈ పంట సాగు, ప్రస్తుతం రికార్డు స్థాయిలో కేవలం ఒక్క గొల్లప్రోలు మండలంలోనే సుమారు 450 ఎకరాల్లో కొనసాగుతోంది. జిల్లాలో 590 ఎకరాల్లో సుమారు 350 మంది రైతులు నువ్వుల సాగు చేపట్టారు. సాధారణంగా ఏటా 3,540 క్వింటాళ్ల దిగుబడిని సాధిస్తున్నారు.

ఉష్ణోగ్రతే దీనికి ప్రాధాన్యం

ఈ పంటకు 25 డిగ్రీల నుంచి 37 డిగ్రీల ఉష్ణోగ్రత అవసరమవుతుంది. నీరు నిలవని, మురుగు నీరు రాని ప్రాంతాలు వీటికి అనుకూలం కావడంతో, రేగడి నేలలున్న ప్రాంతాల్లో 90 శాతం మంది రైతులు వీటిని సాగు చేస్తున్నారు. ఆమ్ల, క్షార నేలలు అంతగా అనుకూలం కాదు. గౌరి, మాధవి, వైఎల్ఎం 11, 17, 66 రకాలు మంచి దిగుబడులు ఇస్తాయని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ రకాలనే జిల్లాలో అత్యధికంగా సాగు చేపట్టారు. కేవలం 85 నుంచి 90 రోజుల్లో పంట చేతికందుతుంది. ఇందులో 50 శాతం నూనె దిగుబడి వస్తుంది. ఎకరాకు వరుసల్లో విత్తుకుంటే 2 కిలోలు, వెదజల్లితే 4 కిలోల విత్తనాలు అవసరమవుతాయి. విత్తన శుద్ధి చేయడం ద్వారా తెగుళ్లు, పురుగుల దాడి నుంచి పంటను కాపాడుకోవచ్చు. మొక్కలకు మధ్య కనీసం అరడుగు దూరం ఉండేలా నాటడం వల్ల అధిక దిగుబడి వస్తుందని అధికారులు సూచిస్తున్నారు. కలుపు నివారణకు ప్రాధాన్యమివ్వాలి. ఆకు ముడత, కాయ తొలుచు పరుగుల నుంచి రక్షణ ఏర్పాట్లు చేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించే అవకాశాలున్నాయి. ఆకు ఎండు, ఆకు కుళ్లు తెగుళ్ల దాడి చేసే అవకాశం ఉండడంతో, ముందుగానే సస్యరక్షణ చర్యలు పాటించాల్సి ఉంటుంది. ఆకు కాయలు 75 శాతం పసుపు రంగుకు మారితే కోత దశకు చేరుకున్నట్టు గుర్తించి, కోతలు చేపట్టాలని అధికారులు అంటున్నారు. కోసిన పంటను కట్టలుగా కట్టి, అదే పొలంలో ఎండకు ఎండేలా నిలబెట్టి, ఐదు రోజుల తర్వాత నూర్చుకోవాలి. ప్రస్తుతం క్వింటాల్ నువ్వుల ధర రూ.10 వేల నుంచి రూ.13 వేల వరకు ఉంది. ఎకరాకు ఆరు క్వాంటాళ్లకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్టు రైతులు చెబుతున్నారు. కేవలం ఆరుతడి, విత్తనం ఎరువులు తదితర అవసరాలకు ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడి అవుతున్నట్టు తెలిపారు.

ఆశాజనకంగా ఉంది

అన్ని పంటలు పూర్తయ్యాక మామూలుగా విత్తనాలు చల్లి వదిలేసేవాళ్లం. ఇప్పుడు ఇదే ప్రధాన పంటగా వేశాం. ప్రస్తుతం మార్కెట్‌లో నువ్వులకు మంచి డిమాండ్ ఉంది. వాతావరణం కలిసి రావడంతో ఈ ఏడాది మంచి దిగుబడి వచ్చేలా కనిపిస్తోంది. పెట్టుబడి తక్కువ కావడంతో పాటు, ఆరుతడి పంట కావడం వల్ల రేగడి నేలల్లో మంచి అనుకూలమైన పంట కావడంతో దీనిని సాగు చేస్తున్నాం. ఆదాయం బాగా వచ్చే అవకాశాలు ఉన్నాయి.

– సోమిశెట్టి జగ్గారావు, నువ్వుల రైతు, దుర్గాడ, గొల్లప్రోలు మండలం

సాగు విస్తీర్ణం పెరిగింది

ఈ ఏడాది నువ్వుల సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. గతంలో 100 ఎకరాలు కూడా ఉండని పంట, ఈ ఏడాది ఒక్క గొల్లప్రోలు మండలంలోనే 400 ఎకరాల వరకు వేశారు. ప్రస్తుతం ఎండలు బాగా ఉండడంతో పంట దిగుబడి పెరిగి, ఆదాయం బాగుంటుంది. ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు రైతులకు వివరిస్తున్నాం. నీటి వసతితో పెద్దగా పని లేకపోవడం వల్ల ఇతర పంటల కంటే పెట్టుబడి తక్కువ కావడంతో రైతులు ఎక్కువ మంది ఈ పంట సాగు చేశారు. పంట అన్నిచోట్లా ఆశాజనకంగా ఉంది.

– సత్యనారాయణ, వ్యవసాయ శాఖాధికారి, గొల్లప్రోలు

కరోనాతో నువ్వుల నూనెకు డిమాండ్

తెలుగు రాష్ట్రాల్లో నూనె గింజల పంటల్లో నువ్వులు ఒకటి. తక్కువ పెట్టుబడితో స్వల్ప కాలంలో అంది వచ్చే నూనె గింజల పంటల్లో నువ్వుల సాగు మేలైనది. ఖరీఫ్‌లో వేసిన వివిధ పంటలను తొలగించాక, రెండో పంటగా డిసెంబర్ నెలాఖరు నుంచి జనవరి చివరి వరకు రైతులు ఈ పంట సాగు చేపట్టారు. తక్కువ పెట్టుబడి, తక్కువ వనరులతో నికర లాభాలందించే పంటగా నువ్వులకు గుర్తింపు ఉంది. **కేవలం రెండు, మూడు తడులు మాత్రమే ఇస్తే** సరిపోయే పంట కావడంతో, వేసవిలో ఎక్కువగా సాగు చేస్తుంటారు. ఆరుతడి పంటగా వేసవిలో వేయడం వల్ల చీడపీడల బెడద చాలా తక్కువ. కరోనా సమయంలో నువ్వుల నూనెకు డిమాండ్ పెరగడంతో, ఇప్పుడు నువ్వుల పంటను భారీగా సాగు చేస్తున్నారు.

దైవ కార్యానికి బయలుదేరి.. తిరిగిరాని లోకాలకు


సంఘటన స్థలంలో వాహనంలో ఇరుక్కున్న మృతదేహాలు


మండపేటలో పాపారావు ఇంటి వద్ద విషాదంలో బంధువులు

- కంచకచర్ల వద్ద రోడ్డు ప్రమాదం
- ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు
- ఒకే కుటుంబంలో ముగ్గురి దుర్మరణం
- మృతులు మండపేట వాసులు


సత్యసురేన్ (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్: దైవకార్యంలో పాల్గొనా లన్న సంకల్పంతో కుటుంబ సమేతంగా పొరుగు రాష్ట్రం నుంచి కారులో బయలుదేరారు. అయితే.. లారీ రూపంలో మృత్యువు వారిని మార్గం మధ్యలోనే కబళించింది. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలు, వారి ఐదేళ్ల చిన్నారి మృతి చెందిన విషాద సంఘటన శుక్రవారం తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని ఓ ఐటీ కంపెనీకి చెందిన హెచ్ఆర్ ఉద్యోగి భోగిళ్ల వెంకట సత్య సురేన్(37), తన భార్య నవ్య(35), కుమార్తె వాసుకి కృష్ణ(5), బంధువు కారులో కోనసీమ జిల్లా మండపేటలో జరగనున్న ఓ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి బయలుదేరారు. శుక్రవారం మధ్యాహ్నం 12.45 ప్రాంతంలో తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి వద్ద జాతీయ రహదారిపై సత్యసురేన్ డ్రైవ్ చేస్తున్న కారు హైవే మెయింటెనెన్స్ పనులు చేస్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. దీంతో సత్య సురేన్, అతని భార్య నవ్య అక్కడికక్కడే మృతి చెందగా, కుమార్తె వాసుకి కృష్ణ, బంధువు శ్రీరమ్యను తణుకు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వాసుకి కృష్ణ మృతి చెందగా, శ్రీరమ్యను మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రూరల్ ఏఎస్సై పీవీకే దుర్గారావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించి, రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విషాద ఛాయలు

మండపేట: కుంచనపల్లి వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మండపేటకు చెందిన భార్యాభర్తలు, ఐదేళ్ల చిన్నారి మృతి చెందడంతో పట్టణంలో విషాద ఛాయలు అలముకున్నాయి. హైదరాబాద్ నుంచి మండపేటకు వస్తూ వీరు ఈ దుర్ఘటనలో మరణించారు. సత్యసురేన్ తండ్రి భోగిళ్ల పాపారావు స్థానిక రావు పేటలో నివసిస్తున్నారు. ఆయన బీమా కంపెనీ రిటైర్డ్ ఉద్యోగి. ఆయనకు ఇద్దరు కుమారులు కాగా, సత్య సురేన్ చిన్నవాడు. ఈ ఘటనలో పాపారావు చెల్లెలు కుమార్తె ఉప్పులూరి శ్రీరమ్యకు తీవ్ర గాయాలయ్యాయి. యూఎస్‌లో ఉంటున్న ఈమె ఇటీవల గృహ ప్రవేశ శుభకార్యానికి హైదరాబాద్ వచ్చారు. ఆమె తండ్రి పొలచర్ల బాబ్జి మండపేటలో ఉంటున్నారు. ఒకే కుటుంబంలో ముగ్గురిని మృత్యువు కాటేయడంతో కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు.

చిడిపిలో కుల బహిష్కరణ ?

- చెరువు గట్టు ఆక్రమణతో రెండు వర్గాల మధ్య వివాదం
- మాట్లాడితే రూ.2 వేల జరిమానాకు నిర్ణయం
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం


చిడిపి గ్రామంలో వివాదానికి కారణమైన రజకుల వృత్తి చెరువు

కొవ్వూరు: ఆధునిక సమాజంలో కొన్ని పల్లెల్లో నేటికీ కుల బహిష్కరణ దూరాచారం పడగ విప్పుతోంది. కొవ్వూరు మండలం చిడిపి గ్రామంలో రెండు వర్గాల మధ్య కార్చిచ్చు రేగింది. గ్రామంలో ఉన్న రజకుల చెరువు గట్టు ఆక్రమణ వ్యవహారంతో రజకులు, గౌడ సంఘం మధ్య వివాదం తలెత్తింది. ఈ వ్యవహారం హైకోర్టుకు చేరడంతో, ఒక వర్గాన్ని మరో వర్గం వారు బహిష్కరించే వరకు వెళ్లింది. ఒకే ప్రాంతంలో కొన్నేళ్లుగా కులమతాలకతీతంగా, అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉన్న మిత్రులంతా ఇప్పుడు విరోధులుగా మారారు. రజకులతో మాట్లాడవద్దని, పెళ్లిళ్లు, విందులకు వెళ్లరాదని, మాట్లాడిన వారికి రూ.2 వేల జరిమానా విధిస్తామని, సమాచారం ఇచ్చిన వారికి రూ.200 బహుమానం ఇస్తామని గౌడ సంఘం తీర్మానం చేసినట్టు చెబుతున్నారు. చెరువు గట్టు ఆక్రమణలు తొలగించాలని ఇటీవల హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీనిని సక్రమంగా అమలు చేయని అధికారులపై చర్యలు కోరుతూ కోర్టును ఆశ్రయిస్తామని అనంతపురం జిల్లాకు చెందిన రజక సంఘ నాయకులు, న్యాయవాది హనుమన్న తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం మీడియాకు విడుదల చేసిన వీడియోతో కుల బహిష్కరణ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

అసలు వివాదం ఇదీ..

గ్రామాన్ని ఆనుకుని రజకులకు 1.24 ఎకరాల వృత్తి చెరువు ఉంది. దీని గట్టు ఆక్రమించుకుని కొందరు గడ్డిమేనులు వేశారు. గౌడ సంఘం చెరువు గట్టున పాపయ్య గౌడ విగ్రహాన్ని నెలకొల్పింది. చిన్న షెడ్డు వేసి, అందులో దేవీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రజకులు ఆక్రమణలపై కోర్టును ఆశ్రయించారు. దీంతో అధికారులు కోర్టు ఆదేశాల మేరకు ఆక్రమణల తొలగింపునకు పూనుకున్నారు. దీనిని గౌడ సంఘం అడ్డుకోవడంతో శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని, ఆక్రమణలను అసంపూర్తిగా తొలగించి అధికారులు చేతులు దులుపుకొన్నారు. అప్పటి నుంచి ఆయా వర్గాల మధ్య చిచ్చురేగింది. చివరికి రజకులను బహిష్కరించి, వారి వద్ద నుంచి క్రయవిక్రయాలు సైతం మానేశారు. ఈ దురాచారంపై ఏ ఒక్క అధికారి కానీ, రాజకీయ పార్టీలు కానీ పట్టించుకోవడం లేదని రజకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాట్లాడితే జరిమానా



పదేళ్ల క్రితం యాక్సిడెంట్ అయింది. రజక వృత్తి కానీ, పొలం పని కానీ చేయలేని స్థితిలో ఉన్నాను. గ్రామంలో టిఫిన్ సెంటర్ పెట్టి జీవనం సాగిస్తున్నాను. గ్రామంలో అన్ని కులాల వాళ్లు టిఫిన్ పట్టుకెళ్లేవారు. ఇప్పుడు వివాదం కారణంగా రజకులతో గౌడ సంఘం వారు మాట్లాడడం లేదు. మాట్లాడితే జరిమానా అంటున్నారు. టిఫిన్ బకాయిల కోసం మాట్లాడలేని పరిస్థితి ఉంది. టిఫిన్ కొనుగోలుకూ ఒక వర్గం వారు రావడం లేదు.

– ఆచంట వెంకటరమణ, చిడిపి, కొవ్వూరు మండలం

కోర్టుకు వెళ్లామని ఇబ్బంది



చెరువును 40 ఏళ్ల నుంచి కుల వృత్తికి వినియోగించుకుంటున్నాం. పంచాయతీ నుంచి లీజుకి తీసుకున్నాం. చెరువు గట్టు ఆక్రమణలు తొలగించాలని హైకోర్టుకు వెళ్లాం. కోర్టు ఆదేశించినా ఆక్రమణలు తొలగించడం లేదు. రజకులతో మాట్లాడకూడదని, మాట్లాడితే జరిమానా విధిస్తామని చెబుతున్నారు.

– కొండపల్లి వెంకటరత్నం, చిడిపి

ఒప్పుకోవడం లేదు



రెండు వర్గాల మధ్య మాటల్లేవు. 2011 నుంచి చెరువు ఆక్రమణ తొలగించాలని వివాదం నడుస్తుంది. గ్రామ పెద్దలంతా కలిసి ఇరు పక్షాల మధ్య సఖ్యత కుదిర్చేందుకు ప్రయత్నించాం. పలు మార్లు చర్చలు జరిపాం. రజకుల కుల బహిష్కరణ అంశం నా దృష్టికి వచ్చింది. పరిష్కారానికి ఇరు పక్షాలు ఒప్పుకోవడం లేదు.

– పొలగుదుల లక్ష్మణరావు, సర్పంచ్, చిడిపి

తండ్రే.. కాలయముడు

- ఇద్దరు పిల్లలను చంపి.. తానూ ఆత్మహత్య
- కాకినాడ తోట సుబ్బారావునగర్‌లో ఘటన
- హోలీ పండగ పూట విషాదం


చంద్రకిశోర్(ఫైల్)


ఓ బాబు మృతదేహం

కాకినాడ రూరల్: అభం శుభం తెలియని ఆ పసి పిల్లల పాలిట ఆ తండ్రి కాలయముడయ్యాడు. కారణమేంటో తెలియదు కానీ.. ఇద్దరు చిన్నారులను బలిగొన్నాడు. అంతటితో ఆగక తాను ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉలిక్కిపడేలా చేసే ఈ సంఘటన కాకినాడలోని తోట సుబ్బారావు నగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. భార్యా పిల్లలతో చీకూచింతా లేని కుటుంబం. ఆర్థికంగా దన్నుగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్జీసీలో ఉద్యోగం. ఏమైందో ఏమో కానీ, అల్లారు ముద్దుగా చూసుకోవాల్సిన తండ్రే పిల్లలను నిర్దాక్షిణ్యంగా నీటిలో ముంచి, ఊపిరాడకుండా చేసి హతమార్చాడు. ఆపై తాను ఉరి వేసుకున్నాడు. హోలీ పండగ పూట కాకినాడ రెండో డివిజన్‌లోని తోట సుబ్బారావు నగర్‌లో శుక్రవారం చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి సర్పవరం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన వానపల్లి చంద్రకిశోర్(37) వాకలపూడి ఓఎన్జీసీ కార్యాలయంలో అసిస్టెంట్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. ఉద్యోగరీత్యా భార్యాపిల్లలతో తోట సుబ్బారావు నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నాడు. పిల్లలు జోషిత్(7) ఒకటో తరగతి, నిఖిల్(6) యూకేజీ చదువుతున్నారు. ఇలాఉండగా తోట సుబ్బారావు నగర్‌లో తన ఫ్లాట్ నుంచి హోలీ పండగ వేడుకల కోసం భార్య తనూజ, పిల్లలతో కలిసి వాకలపూడిలో తాను పనిచేస్తున్న ఓఎన్జీసీ కార్యాలయం వద్దకు వెళ్లాడు. అక్కడ హోలీ వేడుకల్లో భార్యను ఉండమని చెప్పి, పిల్లలకు టైలర్ వద్ద కొలతలు తీయించి తెస్తానని ఇంటికి వచ్చాడు. పిల్లల కళ్లకు గంతలు కట్టి, కాళ్లుచేతులు తాళ్లతో కట్టేసి, బాత్రూంలో బకెట్ నీటిలో వారిని ముంచి, ఊపిరాడకుండా చేసి హతమార్చాడు. తర్వాత బెడ్రూంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గంట వరకూ భర్త, పిల్లలు రాకపోయేసరికి కంగారుపడిన భార్య ఫోన్ చేసినప్పటికీ సమాధానం రాలేదు. దీంతో ఓఎన్జీసీ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది తోట సుబ్బారావునగర్‌లో చంద్రకిశోర్ ఇంటికి వచ్చారు. తలుపులు బలవంతంగా తెరిచేసరికి బెడ్రూంలో ఉరి వేసుకుని చంద్రకిశోర్ కనిపించాడు. పిల్లలు బాత్రూంలో విగతజీవుల్లా కనిపించారు. విషయం తెలుసుకున్న భార్య, ఇతర కుటుంబ సభ్యులు, ఓఎన్జీసీ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. కళ్లెదుటే భర్త, పిల్లలు శవాలుగా పడి ఉండడంతో భార్య తనూజ స్పృహ కోల్పోయింది. బంధువుల సపర్యలతో స్పృహలోకి వచ్చిన ఆమె రోదించిన తీరు చూపరులను కలచివేసింది. ఆమెను ఓదార్చడం బంధువులకు కష్టంగా మారింది. సర్పవరం ఎస్సై శ్రీనివాస్‌కుమార్ కేసు నమోదు చేశారు. సీఐ పెద్దిరాజు విచారణ చేపట్టారు. చంద్రకిశోర్ బెడ్రూంలో సూసైడ్ నోట్‌ను పోలీసులు కనుగొన్నారు. ప్రస్తుత జనరేషన్‌లో తన పిల్లలు సరిగ్గా చదవడం లేదని మనస్తాపం చెంది చనిపోతున్నట్టుగా రాసి ఉందని తెలిసింది. ఈమధ్యే పిల్లల స్కూలు కూడా మార్చినట్టు బంధువులు తెలిపారు.

మద్యం మత్తులో వ్యక్తి హల్‌చల్

కాజులూరు: మద్యపానం తాగితే మనిషి మానవత్వాన్ని మరచి, క్రూరత్వాన్ని ప్రదర్శిస్తాడనటానికి ఈ సంఘటన నిదర్శనం. శలపాక గ్రామ శివారు డేగలపేటలో ఓ వ్యక్తి మద్యం మత్తులో తన సమీప బంధువులతో ఘర్షణకు దిగి, ముగ్గురిని ట్రాక్టర్‌తో ఢీకొనడమే కాకుండా, అడ్డువచ్చిన తన తల్లిని సైతం ట్రాక్టర్‌తో ఢీకొట్టి తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డేగలపేటకు చెందిన డేగల సత్యనారాయణ (బాబి) సొంతంగా ట్రాక్టర్ కొని, వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం మద్యం తాగి తన ట్రాక్టర్‌తో ఇంటికి వస్తూ, వీధి ఇరుకుగా ఉండటంతో తన సమీప బంధువులైన కరెడ్ల సత్తిబాబు, కరెడ్ల శ్రీరామ్ మోటారుసైకిళ్లను ఢీకొట్టాడు. దీంతో సత్తిబాబు, శ్రీరామ్, అతని భార్య బుజ్జమ్మతో ఘర్షణకు దిగి, వారిని ట్రాక్టర్‌తో ఢీకొట్టాడు. ఈ సంఘటనలో బాబి తల్లి డేగల సుబ్బలక్ష్మి అడ్డుపడగా, ఆమెనూ ట్రాక్టర్‌తో ఢీకొట్టి వెళ్లిపోయాడు. క్షతగాత్రులను స్థానికులు కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడు శ్రీరామ్ ఫిర్యాదు మేరకు గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ కేసు నమోదు చేశారు.

పీచు ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

మలికిపురం: మండలంలోని గొల్లపాలెం గ్రామంలో ఓఎన్జీసీ జీసీఎస్ సమీపంలోని రెండు పీచు ఫ్యాక్టరీల్లో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీ వద్ద పీచు పెద్దఎత్తున దగ్ధమైంది. గ్యాస్ కలెక్టింగ్ స్టేషన్‌కు సమీపంలో ప్రమాదం సంభవించడంతో, సంస్థకు చెందిన ఫైరింజన్లు అప్రమత్తమై, మంటలను అదుపు చేశాయి. ఈ సంఘటనలో అడబాల రాము, మంచికంటి చంటికి చెందిన పీచు ఫ్యాక్టరీలు ప్రమాదానికి గురి కాగా, సుమారు రూ.8 లక్షల ఆస్తినష్టం వాటిల్లి ఉంటుందని అగ్నిమాపకాధికారులు తెలిపారు.

కుప్పకూలిన వంతెన


వంతెన కూలిపోయి, కాలువలో ఇరుక్కున్న టిప్పర్

మామిడికుదురు: నగరం గ్రామంలో శుక్రవారం ఈదరాడ పంట కాలువపై వంతెన కుప్పకూలింది. సుమారు 35 టన్నుల ఇసుక లోడుతో ఉన్న టిప్పర్ వంతెనపైకి ఎక్కిన వెంటనే వంతెన కూలిపోయింది. దీంతో టిప్పర్ వెనుక భాగం కాలువలో కూరుకుపోయింది. ఎవరికీ ప్రాణాపాయం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. రావులపాలెం నుంచి ఇసుక లోడుతో వచ్చిన టిప్పర్‌ను.. వంతెనపైకి రివర్స్‌లో ఎక్కిస్తుండగా, బరువంతా ఒక్కసారిగా వంతెనపై పడడం వల్లే అది కుప్పకూలిందని స్థానికులు తెలిపారు. కాలువలో ఇరుక్కున్న టిప్పర్‌ను బయటకు తీసేందుకు చర్యలు చేపట్టారు.

పొలంలో స్వల్పంగా గ్యాస్ లీక్


మామిడికుదురులో గ్యాస్ లీకైన ప్రాంతం

మామిడికుదురు: పాశర్లపూడి–43 బావి నుంచి తాటిపాక జీసీఎస్‌కు గతంలో వేసిన పైపులైన్ నుంచి శుక్రవారం స్వల్పంగా గ్యాస్ లీకైంది. మామిడికుదురు గ్రామంలో ఏటిగట్టు పక్కన పొలాల్లో ఈ లీకేజ్ ఏర్పడింది. లీకేజ్ ఏర్పడిన చోట నుంచి స్వల్పంగా గ్యాస్ బయటకు వచ్చింది. దీంతో పాటు కొద్దిగా ముడి చమురు కూడా లీకైంది. దీంతో ఆ ప్రాంతమంతా ముడి చమురు వాసన వ్యాపించింది. ముడి చమురు ప్రభావంతో పొలంలో నీరు తెట్టు కట్టింది. ఓఎన్జీసీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ బావి నుంచి ఎటువంటి ఉత్పత్తి జరగడం లేదన్నారు. చాలా కాలం క్రితం ఆ బావిలో ఉత్పత్తి నిలిచిపోయిందన్నారు. పైపులైన్‌లో ఉన్న గ్యాస్, ముడి చమురు బయటకు వచ్చి ఉంటాయన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో పరిశీలన చేస్తామని చెప్పారు.